“విహారి! నువ్వు అసలు విషయం మర్చిపోతున్నట్టున్నావు. వద్దని ఆస్థికి “కొడుగ్గా” నీ కన్నా- “భర్త”గా నేను మొదటి హక్కు దారున్ని నువ్వు నాకు ఏ మాత్రం వ్యతిరేకంగా పనిచేసినా ఈ ఆస్థిలో ఒక్క పైసా అయినా ఖర్చు పెట్టే హక్కు నీకుండదు.”

విహారి వినడం లేదు. అతడు అప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశాడు. పరమేశ్వరం చెప్పదల్చుకున్నది అర్థమైంది.

అతడు తన తండ్రివైపూ, స్వామివైపూ చూసి స్థిరంగా అన్నాడు “నేనీ క్షణమే ఇంటినుంచి వెళ్ళిపోతున్నాను.”

అతడి గొంతులో ఒక నిశ్చయం తొంగిచూసింది.

“కోట లోపలుండి తిరగబడితే నమ్మకద్రోహం అవుతుంది. కోట బయట నుంచి తిరగబడితే అది యుద్ధం అవుతుంది. మీరన్నట్టు నేననే శక్తి కేవలం సామాన్యుడికే వుంది తప్ప మరే అధికార్లకీ ..... బ్యూరోక్రాట్లకీ లేదు.”

వెళ్ళబోతూ ఆగి అతనన్నాడు - “చుశావా స్వామీ ..... నాలుగు స్థంభాలు పటిష్టమైన భవంతి అన్నావు. స్వార్థాన్ని, భద్రతపట్ల భయాన్నీ, సుఖాన్నీ వదులుకుని సామాన్యుడు తిరగబడితే, ఎంత సులభంగా నీ మొదటి స్థంభం కూలిపోయిందో చూడు. యిక మూడు స్థంభాలే వున్నాయి నీ “బలాన్నీ”, “రాజకీయాన్నీ” పడగొట్టి, “తెలివిని” నా తల్లికి బహుమతిగా ఎలా అర్పిస్తానో చూస్తూ వుండు - నీకే తెలుస్తుంది.”

# 16

“గోల్డన్ ఐలెండ్”లో స్వామి తాలూకూ స్వంత హెలికాప్టర్ దిగింది. హెలిపాడ్ నుంచి కారు వరకూ ఎర్ర తివాచీ, చుట్టూ పూల మొక్కలు, క్రమశిక్షణలో నిష్ణాతులయిన సైనికులు వందనం చేస్తుండగా స్వామి దిగి కారులో ఎక్కి కూర్చున్నాడు.

రోడ్డు కిరువైపులా కొబ్బరిచెట్లు, మధ్యలో చక్కటిదారి. దాదాపు పదినిమిషాలు ప్రయాణం చేసిన తర్వాత అతడికారు పెద్ద కాంపౌండ్‌లో ప్రవేశించింది. చుట్టూ బార్బ్‌డ్‌వైరు ఫెన్సింగ్ - గార్డులు, సుశిక్షితమైన అల్సేషన్ కుక్కలు - అదో కొత్త రకం ప్రపంచంలా వుంది.

అశేషమైన ప్రజల అజ్ఞానాన్ని ధనంగా మార్చి కట్టినట్టు - ఆ దీవి మధ్యలో విశాలమైన భవంతి - ఎత్తయిన చెట్లు - మొత్తం పాలరాయి.

స్వామి ఠీవిగా ఎక్కుతూ వుంటే - బారులు తీర్చిన సైనికులు సెల్యూట్ చేశారు.

అతడు దీవికి చేరుకున్న గంటలోపులో మరో రెండు హెలికాప్టర్లు మూడు ఫ్రెండ్స్ ఫోకర్స్ వచ్చి దిగాయి. మొరాకో, ఈక్వెడర్ మొదలైన దేశాల్నుంచీ కేప్‌టౌన్, ప్రిటోరియా, బ్లూమ్‌ఫీల్డు మొదలయిన నగరాల్నుంచీ ప్రతినిధులు వచ్చారు. భారత దేశపు పక్క శత్రుదేశాలు, ఒక అగ్రరాజ్యపు రహస్య ప్రతినిధుల సంగతి సరేసరి. దక్షిణాఫ్రికా సంగతి తెలియనిదేముంది? రెండు కోట్లకు పైగా జనసంఖ్య వున్న దేశంలో కేవలం 37 లక్షల మందికే ఓటు హక్కు వున్న

దౌర్భాగ్య దేశం. అటువంటి దేశం ప్రతినిధులు స్వామిలాటి వారికి సాయపడడంలో విచిత్రం లేదు. ఆసియా ఖండంలో భారతదేశపు ప్రాబల్యం తగ్గిస్తే కొన్ని దేశాలకు మంచిది. వారూ పాల్గొన్నారు.

కొంతమంది స్వార్థపూరిత వ్యక్తులు, తమ లాభం కోసం పన్నే "వ్యూహా"నికి మరోపేరు "రాజనీతి!!" ఫిలిప్ఫైన్స్‌లో అయినా, ఫిజీ ద్వీపంలో అయినా, దక్షిణాఫ్రికాలో అయినా వీరు ఉపయోగించేది ఆ పేరే. మొట్టమొదటిసారి భారతదేశంలో ఆ రకమైన తిరుగుబాటు జరగడానికి పునాదులు తవ్వబడుతున్నాయి.

స్వామి అండతో కేంద్ర మంత్రివర్గంలో నెంబర్ టూ అయిన సూర్యారావు చాపక్రింద నీరులా విజృంభిస్తున్నాడు. ఇప్పటికే రకరకాల "తలనొప్పు"లతో సతమతమౌతూన్న ప్రధానమంత్రి, అతడిని తొలగిస్తే ఏ పరిణామాలు సంభవిస్తాయా అన్న సంధిగ్దంలో ఉన్నారు. సూర్యారావు ఎంత ప్రమాదకరమైన వ్య క్తో ఇంకా పూర్తిగా బయట పడలేదు. దేశంలో స్వామికి కావలసిన పరిస్థితులు క్రమంగా అలుముకుంటున్న సమయంలో.

ఇక్కడ దీవిలో ..... ఆ హాలులో సమావేశం మొదలైంది.

అదేమీ రహస్య సమావేశం కాదు రోమన్ సాంప్రదాయపు పద్ధతిలో అందమైన ఆడవాళ్ళు వైన్ నింపుతున్నారు. ఒక మూల ఒక స్త్రీ తీగెల్తో చేయబడిన సంగాతి (సితారు లాంటి వాధ్య విశేషం) వాయిస్తున్నది. కొందరు పరిచారికలు తినుబండారాలు సర్దుతున్నారు అతిథుల మాటలన్నీ వింటున్నారు.

అదే అనుమానం ఎవరికో వచ్చినట్టుంది. "మనం ఏదైనా మందిరం లోపల కూర్చుంటే బావుంటుందేమో" అని అడిగారు.

స్వామి నవ్వేడు. "ఈ దీవే ఒక మందిరం. ఇక్కడ పురుగు కూడా అనుమతి లేకుండా బయటకు పోలేదు."

నిజమే అయి వుండవచ్చు. మామూలుగా అయితే ఇటువంటి మీటింగ్స్ అండర్ గ్రౌండ్స్‌లోనో, చీకటి కప్పిన గుహలోనో జరగాలి. ఏది ఏమైనా అక్కడ వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా వుంది చెట్ల నీడలు అద్దాల అవతల్నుంచి అందంగా కదుల్తున్నాయి. హాండ్లీయర్ల కాంతి కెరటల్లా ఆ హాల్లో పరచుకుంటూంది. అగరొత్తుల పరిమళం ఆ హాలంతా పరచుకుని వుంది. ఆ వాతావరణంలో వాళ్ళ భవిష్యత్ కార్యక్రమం గురించి చర్చించసాగారు.

జపాన్ నుంచి వచ్చే షిప్‌లో మారణాయుధాలు ఎలా మార్పిడి జరగాలి. దేశంలోకి అవి ఎలా సరఫరా జరగాలి. ఈపాటికే దేశంలో వివిధ ప్రాంతాల్లో సర్దుకున్న శిక్షితులైన సైనికులు వివిధ పుణ్య క్షేత్రాలలో ఎలా అలజడి సృష్టించి హిందూ దేశపు మెజారిటీ మతస్తులని ఎలా రెచ్చగొట్టాలి. ఎన్ని రోజుల తరువాత సూర్యారావు ప్రధాన మంత్రి మీద తిరగబడాలి, ఎప్పుడు అనంతానంతస్వామి సర్వ సైనికాధికారిగా, మత సంరక్షుకుడిగా దేశపు రక్షణ బాధ్యత

మీద చర్చలు జరిగి, ప్రమాణికలు ఏర్పాటు చేయబడ్డాయి.

దాదాపు అరగంట సమావేశం. అయ్యాక వారు లంచ్‌కి లేచారు.

అద్భుతమైన లంచ్ అది. ఫిలిప్పైన్స్ కిష్టమయిన ఆస్ పెడగస్ నుంచి బోర్నెంటోల వరకూ అరవై రకాల వంటకాలు. ఋతువులతో సంబంధం లేకుండా, 'దొరకవు ..... దొరుకుతాయి' అన్న ప్రశ్న లేకుండా దాదాపు ఇరవైమంది కన్యలు అధునాతనమైన బికినీలతో మునికన్యల్లా వడ్డన చేస్తూండగా ప్రతినిధులు భోజనం పూర్తిచేశారు. ఫెర్మ్యాఫ్యుమ్ కూల్డ్ గదుల్లో రెండు గంటలు విశ్రమించాక తన దీవి చూపించాడు స్వామి.

పైకి మామూలుగా కనిపించే ఆ దీవిలోని భవంతి అడుగున దాదాపు పదివేల అడుగుల హాలులు అయిదారు వున్నాయి. ఫ్లెమింగ్ నవలల్లో మాదిరి పూర్తి వాటర్ ప్రూఫ్ గదుల్లో ..... అగ్రరాజ్యాల అధునాతన పరికరాల్ని తలదన్నే ఆయుధాలు తయారు చేయబడుతున్నాయి.

ఆ గదిలోని కొబ్బరికాయలాంటి ఆకారంలో వున్న బాంబులు అతిథుల్ని ఆకర్షించాయి. ముందు వారు వాటిని కోకోనట్సే అనుకున్నారు. కానీ, ఆ రంగంలో ప్రవేశం వున్న వారవడం వల్ల వెంటనే తేడా గుర్తుపట్ట గలిగాడు. మామూలు మనుష్యులకయితే అసలు తెలీదు.

వారి అనుమానం గ్రహించినట్టు స్వామి అన్నాడు - "న్యూక్లీ థెర్మో - ఎక్స్‌ప్లోజివ్స్. దేవుడి ముందు పూజారి కొట్టగానే దాదాపు వెయ్యి గజాల దూరంలో వున్న ప్రతి వస్తువూ పేలి పొడిగా మారిపోతుంది. ఈ రకమైన విస్ఫోటం ఇటీవలే కనుక్కోబడింది. దాదాపు పది గ్రెనేడ్‌లకి సమానమైంది" నవ్వేడు. "..... ఒకేరోజు అయిదారు పవిత్ర దేవాలయాలు. దానికి ప్రతిగా తాజ్‌మహల్, దర్గా - మరోవేపు భాక్రానంగల్, గోదారి బ్యారేజ్ - ఆ సంక్షోభాన్ని మీరే వూహించండి."

వాళ్ళు ముందుకు సాగారు.

ఆ తర్వాత గదిలో దృశ్యం చూసి వారి వళ్ళు అప్రయత్నంగా జలదరించింది. అందులో వరుసగా బీరువాలున్నాయి. నలువేపులా అద్దాలు, లోపల ఏదో చిక్కటి ఆముదంలాంటి ద్రవం వుంది.

అదికాదు వారిని భయభ్రాంతుల్ని చేసింది.

-- ఆ బీరువాల్లో సజీవ ప్రతిమల్లా శవాలున్నాయి. అచ్చంగా మనుషులు బోనుల్లో నిల్చున్నట్టే వున్నాయి. ఆ శవాలు కళ్ళల్లో మాత్రం జీవంలేదు.

"నాకెదురు తిరిగిన ప్రముఖులు, నన్నుమోసం చేద్దామనుకున్న అనుచరులు --" అన్నాడు స్వామి. " ..... నా విజయానికి ప్రతీకలు ..... కొందరికి పూవుల్ని చూస్తే, కొందరికి చేపల్ని చూస్తే సంతృప్తి కలుగుతుంది. నేను ఆ బీరువాల్లో శవాల్ని చూస్తూ ఆనందిస్తూ వుంటాను. దీన్ని ఇంగ్లీషులో ఏమంటారు? -- సాడిజమా హ్హాహ్హా ..... '

ఎవరూ మాట్లాడలేదు. ఆ దృశ్యం కలిగించిన షాక్‌నుంచి ఇంకా వారు తేరుకోలేదు.

ముందుకు నడిచారు. కొన్ని బీరువాలు ఖాళీగా వున్నాయి. ఇంకా వాటిని నింపలేదు.

అయితే కొత్తగా చేయించినట్టున్న ఒక బీరువా మాత్రం వాడిని ఆకర్షించింది.

“ఇదేమిటి - మిగతా వాటికన్నా ఇది వెడల్పుగా వుంది?” అని ఎవరో అడిగారు. స్వామి మళ్ళీ నవ్వేడు.

‘మా హిందూ ధర్మం ప్రకారం కొన్ని ప్రదేశాల్లో భర్తతోపాటు భార్యని గూడ చితిలో కాలుస్తారు. నేను కాస్త ముందుకెళ్లి ప్రేయసీ ప్రియుల్ని కూడా మరణానంతరం ఒకేచోట వుంచడం కోసం యిది స్పెషల్‌గా తయారు చేయించాను. ఇంకో రెండు మూడు రోజుల్లో ఆ శవాలు వస్తాయి ఇక్కడికి?”

“ఎవరా ప్రియుడు?”

“నికుంజ్ విహారి అని ..... ”

# 17

రాత్రి ఒంటిగంట కావొస్తూండగా అకస్మాత్తుగా మెలకువ వచ్చింది విహారికి.

కొద్దిసేపు పాటు తనెక్కడ వున్నాడో అర్థంకాలేదు. తలతిప్పి చూస్తే పక్కనే సునాదమాల పాత పత్రికతో విసురుతూ కనిపించింది.

అతడు చప్పున లేచి కూర్చుని “ఏమిటిది మాలా” అని అడిగాడు.

ఆమె నవ్వింది.

“మీకు ఫ్యాను బాగా అలవాటు అనుకుంటాను. చాలా సేపట్నుంచీ అటూ ఇటూ కదులుతున్నారు. ఇటు పడుకుంటే ఇటో దోమ చెంపమీద వాలుతోంది. అటు పడుకుంటే అటోదోమ బుగ్గని ముద్దు పెట్టుకుంటూంది.”

“అందుకని? దోమనైనా కాకపోతిని ప్రియుని బుగ్గను కొరకగా అని పాడుకుంటూ వూపుతున్నావా విసనకర్ర ..... చాల్చాల్లే” అంటూ ఆమె చేతిలో పుస్తకం లాక్కొని లేచి కూర్చున్నాడు. “ఇప్పటికే ఇలా మీ దగ్గిరకి వచ్చేసినందుకు సిగ్గుతో చచ్చిపోతున్నాను.”

“అంతమాట అనకండీ! నాకీరోజు ఎంత సంతోషంగా వుందో చెప్పలేను.”

“నాకు మాత్రం చాలా గిల్టీగా వుంది.”

అంతలో బయట పెద్ద శబ్దం వినిపించింది. “ఏమిటది?” అని అడిగాడు.

“వర్షం వచ్చినప్పుడు మా ఇంటి బంగళా పెంకులు చేసే శబ్దం-”

మళ్ళీ నవ్వింది. “చెప్పండి, ఎందుకు గిల్టీగా వుంది?”

“ఒక పెద్ద ఆస్తికి వారసుడిగా నిన్ను ప్రేమించాను. ఇప్పుడు ఏమీ లేని బికారిగా నీ ఇంటిలోనే వుంటున్నాను.”

ఆమె ముఖంలో నవ్వు మాయమైంది. సాలోచనగా అంది -“అలా అనకండి. నాకిలాగే చాలా బావుంది. నేను మీకో విషయం చెప్పనా! అందరూ నన్ను భయస్తురాలు, పిరికి

ఒకరిపట్ల జీవితంలో ఒకే ఒకసారి ఏర్పడే అత్యంత అపురూపమైన అనుభవం నా నమ్మకం. “నేను ఒక్కరికే, నా ప్రేమ ఒక్కరికే” అని నేను అనుకుంటూ వుంటాను. మీరు మాబామ్మతో నవ్వుతూ మాట్లాడినా నాకు ఏడుపొస్తుంది. దయచేసి నా అభిప్రాయాలు విని నవ్వుకోకండి. నేను లేనప్పుడు కూడ మీరు నవ్వుతూ వుండగరలన్న ఆలోచన కూడ నన్ను బాధపెడుతుంది. ప్రేమకు సంబంధించినంత వరకూ నేనంత స్వార్థపరుల్ని, అంత బలంగా లేకపోతే అది ప్రేమకాదు అని నా ఉద్దేశ్యం.”

విహారి ఆమె వైపు విభ్రముడై చూశాడు. ఒక గొప్ప చిత్రాన్ని చూస్తున్నట్టు అనిపించింది. అతడికి ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని “నేను అదృష్టవంతుడిని ” అని మాత్రం అనగలిగాడు.

అంతలో ఒక చుక్క అతడి వంటిమీద పడింది. ఇద్దరూ తలెత్తి చూశారు.

“మీరు అక్కడనుంచి లేవాలి” అంది మాల. “ ..... వర్షం వస్తే అక్కడ కురుస్తుంది” అంటూ లోపలికి వెళ్ళి ఒక గిన్నె తీసుకునివచ్చి అక్కడ పెట్టింది. ఇద్దరూ పక్కకి జరిగి నిలబడ్డారు. అక్కడ కూడ కురవడం మొదలైంది.

“వర్షం తగ్గేవరకూ మనం ఇలా ఈ గదిలో చదరంగం ఆడుకో వాల్సిందే” మరో బాల్చీ తీసుకువచ్చి అక్కడ పెడుతూ అంది. విహారికిదంతా గమ్మత్తుగా వుంది. అతడి మొహంలో మారే భావాల్ని గమనిస్తూ, “హాయిగా ఎయిర్ కండిషన్ గదిలో పడుకోవాల్సిన వాళ్ళు, ఇలా నీటిమధ్య పడవలా తిరుగుతున్నారు. బామ్మ వుంటే నన్ను తిట్టేది.”

“ఎందుకు?”

“మిమ్మల్ని ఇలా తడుపుతున్నందుకు”

అప్పటికి వాళ్ళు గదిలో ఒక మూలకి చేరుకున్నారు. గదినిండా తప్పేశాలు, బాల్చీలు, గిన్నెలు .....

ఆమె సామీప్యం, ఇంట్లో కురుస్తున్న వర్షం -అతడికి ఎంతో థ్రిల్లింగ్‌గా వున్నాయి.

“ఈ మూల కూడా కురిస్తే ఎక్కడికి వెళతాం?” అని అడిగాడు పైకి చూస్తూ.

“బయట వర్షంలోకి.”

“మీ బామ్మ తిడుతుందేమో?”

“ఆ రోజు స్టేజీమీద నా మీద దూలం పడకుండా ఆపు చేశారు. ఈ రోజు మీ మీద నీటి చుక్క పడకుండా ఆపుచెయ్యలేనా?”

“అతడు అమితాశ్చర్యంతో, “కొంపతీసి బోర్లా పడుకుంటావా?” అని అడిగాడు. పైకి నెమ్మదిగా కనబడే అమ్మాయిలు విజృంభిస్తే తుఫానులవుతారని అతనెక్కడో చదివాడు.

ఆమె నవ్వు ఆపుకుంటూ, “ఛా! అదికాదు. పైట కప్పుతాన్లెండి” అంది.